సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 29 । డిసెంబర్ । 2023



త్రివిక్రముడిగా అప్పన్న

సింహాచలం: రాపత్తు ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి త్రివిక్రమాలంకారంలో దర్శనమిచ్చారు..



గవర్నర్‌కు స్వాగతం

విశాఖ: వికసిత్ భారత్ యాత్రలో పాల్గొన డానికి వచ్చిన గవర్నర్ నజీర్‌ను ఏయూ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు.



మార్గశిర శోభ

8లో

విశాఖలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అర్ధరాత్రి నుంచే అమ్మవారి దర్శనానికి బారులుదీరారు.

మహా ప్రాణదీపం

రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి తొలి గంట ఎంతో ముఖ్యమైనది. చావుబతుకుల్లో ఉన్నవారికి సకాలంలో వైద్యం అందితే ప్రాణం నిలబడుతుంది. అంత విషమం కాకపోయినా చికిత్స అందడంలో జాప్యం జరిగితే పరిస్థితి చేయిదాటిపోవచ్చు. అందుకే ఆ గంటను గోల్డెన్ అవర్ అంటారు. అలాంటి స్థితిలో ఉమ్మడి విశాఖ జిల్లాకు ఇంతకాలం విశాఖలోని కింగ్ జార్జి ఆస్పత్రి ఒక్కటే దిక్కు. అనకాపల్లిలో క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మించనుండడంతో అత్యవసర కేసుల్లో క్షతగాత్రుల ప్రాణాలకు భరోసా లభించనుంది.



- జిల్లా ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ యూనిట్
- రూ.22.15 కోట్లతో 50 పడకలు ఏర్పాటు
- ఎన్టీఆర్ వైద్యాలయం ఎదురుగా జీ+2 తరహాలో నిర్మాణం
- నేడు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి

అత్యాధునిక వసతులు ఇవే..

అత్యాధునిక హంగులతో జీ+2 భవన నిర్మాణం చేపట్టనున్నారు.

గ్రౌండ్ ఫ్లోర్‌లో-డయాలసిస్ బ్లాక్, డాక్టర్స్ డైనింగ్ హాల్స్ (మేల్, ఫిమేల్), ఎంసీహెచ్ (2 బెడ్స్), ఎల్‌డీఆర్, అల్ట్రా సౌండ్ రూమ్, ప్లాస్టర్ రూమ్, పీఎంసీ ల్యాబ్, ఎలక్ట్రికల్ రూమ్, డ్యూటీ డాక్టర్ ఎగ్జామినేషన్ రూమ్, ఎమర్జెన్సీ వార్డు, నర్సెస్ రూమ్, ఇంజక్షన్ డ్రెస్సింగ్ రూమ్

ఫస్ట్ ఫ్లోర్‌లో- ఐఎస్‌వో రూమ్, డైనింగ్ హాల్స్-2, ఐఎస్‌వో వార్డు, అత్యాధునిక ఐసీయూ, స్టాఫ్ రూమ్

సెకండ్ ఫ్లోర్- హెచ్‌డీయూ, అనస్తీషియా రూమ్, ఐసీయూ, ఓపీ

సాక్షి, అనకాపల్లి: ఆధునిక వసతులు, వైద్య పరికరాలు సమకూరడంతో కొద్ది కాలంలోనే ఎంతో అభివృద్ధి సాధించిన ఎన్టీఆర్ జిల్లా వైద్యాలయం ఇప్పుడు మరో ముందడుగు వేయబోతోంది. ‘నాడు–నేడు’తో ఆధునికీకరించిన ఈ ఆస్పత్రిలో ఎంపీ ల్యాడ్స్, సీఎస్సార్ నిధులు రూ.30.35 కోట్లతో సీటీ స్కాన్, ఇంటిగ్రేటెడ్ ల్యాబ్, బర్న్ వార్డ్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. తాజాగా అత్యవసర వైద్య సేవల కోసం ‘క్రిటికల్ కేర్’కు శ్రీకారం చుట్టనున్నారు. ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి చొరవతో ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ (పీఎం-ఏబీహెచ్‌ఐఎం) కింద ఎన్టీఆర్ ఆస్పత్రికి రూ.22.15 కోట్లు మంజూరయ్యాయి. ఏపీఎంఎస్ఐడీసీ వారి నిర్వహణలో నిర్మాణ పనులు జరుగుతాయి. టెండర్ ప్రక్రియ కూడా పూర్తయింది. శుక్రవారం కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్సుక్ ఎల్ మాండవియా వర్చువల్ విధానంలో ఎన్టీఆర్ ఆస్పత్రి ఎదురుగా క్రిటికల్ కేర్ బ్లాక్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నారు.

ఎమర్జెన్సీ కేసుల్లో ఉపశమనం

ఎన్టీఆర్ ఆస్పత్రిలో వైద్యసేవలు రోజురోజుకూ మెరుగవుతున్నాయి. రోడ్డు ప్రమాదాల్లో గాయపడే క్షతగాత్రులకు, విషమ పరిస్థితుల్లో ఉన్న పేషెంట్లకు మరింత మెరుగైన వైద్య సేవలను అందించాలని క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణం చేపడుతున్నారు. జిల్లా ఆస్పత్రికి రోగుల తాకిడి పెరగడంతో ప్రస్తుతం ఉన్న ఐసీయూ ద్వారా వారికి సరిపడా వైద్యసేవలందడం లేదు. ఈ క్రిటికల్ కేర్‌తో అత్యవసర వైద్యసేవలకు ఢోకా ఉండదు. 50 పడకలతో అత్యాధునికంగా నిర్మాణం చేపట్టనున్నారు.

సకాలంలో అత్యవసర వైద్య సేవలు



రోడ్డు ప్రమాదాలకు గురైన క్షతగాత్రులను గోల్డెన్ అవర్‌లోపు ఆస్పత్రికి తీసుకెళితే బతికే అవకాశాలుంటాయి. ప్రస్తుతం విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లి వైద్యం అందించే లోపే మృత్యువాత పడుతున్నారు. ఇక్కడ క్రిటికల్ కేర్ యూనిట్ పూర్తయితే.. ఎన్టీఆర్ ఆస్పత్రిలోనే విషమ స్థితిలో ఉన్న రోగులకు వైద్యసేవలందనున్నాయి. ఎన్నో ప్రాణాలు నిలబడతాయి.

– డాక్టర్ శ్రీనివాసరావు, డీసీహెచ్ఎస్



వచ్చే నెల నుంచి కీమో థెరపీ సేవలు

నక్కపల్లి: అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో వచ్చే నెల నుంచి కేన్సర్ రోగుల కోసం కీమో థెరపీ సేవలు అందుబాటులోకి వస్తాయని జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త (డీసీహెచ్) డాక్టర్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన నక్కపల్లి ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనకాపల్లి ఆస్పత్రిలో కీమో థెరపీ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటి పనులు ముగింపు దశలో ఉన్నాయన్నారు. తమ పరిధిలోని అన్ని సీహెచ్‌సీల్లోనూ గుండెపోటుకు గురైన రోగులను కాపాడేందుకు స్టెమీ రూములు ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర సమయంలో రూ.22 వేల విలువైన ఇంజక్షన్‌ను వారికి ఉచితంగా చేస్తున్నామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని జిల్లాలో 24 మండలాల్లో అమలు చేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో 12 మండలాల చొప్పున గైనకాలజిస్టులు, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్ ప్రత్యేక వైద్య నిపుణులతో ప్రజలకు సేవలందిస్తామన్నారు. నక్కపల్లి, అనకాపల్లి, నర్సీపట్నం కేంద్రాల్లో ప్రతి బుధవారం ఈ శిబిరాలు ఉంటాయన్నారు.

రూపాయికే టిడ్కో గృహాలు

- టీడీపీ కౌన్సిలర్లు తప్పుడు ఆరోపణలు మానుకోవాలి
- మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

నర్సీపట్నం: పేదలకు రూపాయికే టిడ్కో గృహాలు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అన్నారు. విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ టీడీపీ కౌన్సిలర్లు టిడ్కో గృహాల విషయంలో తప్పుడు ఆరోపణలు చేయటం సరికాదన్నారు. గత ప్రభుత్వం విధించిన లబ్ధిదారుల వాటాను సీఎం జగన్ సగానికి తగ్గించి ఊరట కలిగించారన్నారు. మరో అడుగు ముందుకేసి సింగిల్ బెడ్‌రూమ్ కలిగిన లబ్ధిదారులకు రూపాయికే గృహాలను మంజూరు చేశారన్నారు. సీఎం తీసుకున్న నిర్ణయంతో మున్సిపాలిటీలోని 364 మంది పేదలు లబ్ధి పొందారన్నారు. జనవరి 20వ తేదీనాటికి లబ్ధిదారులకు గృహాలను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సహకారంతో మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. రోడ్లు భవనాలశాఖ మంత్రిగా పనిచేసిన చింతకాయల అయ్యన్నపాత్రుడు మెయిన్‌రోడ్డును విస్తరించలేకపోయారన్నారు. అయ్యన్నపాత్రుడు చేతులెత్తేస్తే ఎమ్మెల్యే గణేష్ మెయిన్‌రోడ్డు విస్తరణకు శ్రీకారం చుట్టారన్నారు. కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, చెక్కా బాలమ్మ, కోఆప్షన్ సభ్యులు షేక్ రోజా పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రేపు నర్సీపట్నంలో సాధికార బస్సుయాత్ర



బొడ్డేడ ప్రసాద్

సాక్షి, అనకాపల్లి: నర్సీపట్నం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ శనివారం చేపడుతున్న సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. గురువారం అనకాపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి నేటి వరకు 55 నెలల పాలనలో జరిగిన సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించడమే ఈ యాత్ర ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమానికి అనకాపల్లి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పీడిక రాజన్నదొర, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమర్‌నాథ్‌పాటు పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి హాజరు కానున్నారు.

రెండు గంటల్లోనే దొరికిన ఫోన్

- పోలీసులకు ప్రశంసలు



భవానీప్రసాద్‌కు ఫోన్ అందిస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు

రావికమతం: సెల్‌ఫోన్ పోయిందని ఫిర్యాదు చేసిన రెండు గంటల్లోనే పట్టుకొని బాధితునికి అందించిన కొత్తకోట పోలీసులపై ప్రశంసల వర్షం కురుస్తోంది. టి.అర్జాపురం గ్రామానికి చెందిన మత్స భవానీప్రసాద్ మొబైల్ ఫోన్ గురువారం సాయంత్రం బైక్‌పై వస్తుండగా ఎక్కడో పడిపోయింది. ఇంటికి వచ్చాక ఫోన్ పోయిందని గుర్తించి కొత్తకోట పోలీసులకు మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ లక్ష్మణరావు కేసు నమోదు చేసి ఐటీ కోర్ విభాగం సిబ్బందికి సమాచారం అందించారు. ఇరు విభాగాలు సిగ్నల్స్‌ను బట్టి సమీప గ్రామంలో ఫోన్ ఉన్నట్టు గుర్తించి, వెంటనే వెళ్లి స్వాధీనం చేసుకున్నారు.

ప్రాణం ఉన్నంత వరకూ జగన్ వెంటే ఉంటా..

- పార్టీ మారుతున్నట్లు వస్తున్న సోషల్ మీడియా వార్తలు అవాస్తవం
- నాపై దుష్ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవు
- డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు హెచ్చరిక



సాక్షి, విశాఖపట్నం: తాను పార్టీ మారుతున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలన్నీ అవాస్తవమని, నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే నడుస్తానని డీసీసీబీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు స్పష్టం చేశారు. జనసేనలో తాను చేరుతున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను ఆయన తీవ్రంగా ఖండించారు. వైఎస్సార్ సీపీలో పంచకర్ల రమేష్‌బాబు ఉన్నప్పుడు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఫొటోను వైరల్ చేస్తూ.. టీడీపీ, జనసేన నేతలు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజాయతీగా, పారదర్శకంగా ప్రజల మనసులు గెలిచి రాజకీయాలు చేయాలే తప్పితే.. ఇలా తప్పుడు ప్రచారాలకు పాల్పడి రాజకీయాలు చేయడం తగదని వారిని గట్టిగా హెచ్చరించారు. మత్స్యకారుల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే తామంతా ఉంటామన్నారు. తనపై దుష్ప్రచారం చేస్తున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని, వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ గెలుపు కోసం కృషి చేస్తానని ‘సాక్షి’తో చెప్పారు.

సీఎం ఆశయ సాధనే మా ధ్యేయం



దేవరాపల్లిలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న వలంటీర్లు

- తప్పుడు రాతలు రాస్తే గుణపాఠం తప్పదు
- ఈనాడుపై వలంటీర్ల ధ్వజం.. పత్రిక ప్రతులు దహనం

దేవరాపల్లి: వలంటీర్ వ్యవస్థకు రూపకల్పన చేసి తమకు సేవ చేసే భాగ్యాన్ని కల్పించిన సీఎం జగన్ మోహన్‌రెడ్డి అంటే తమకెంతో గౌరవభావం ఉందని, ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువస్తామని వలంటీర్లు అన్నారు. సమ్మెకు సిద్ధమవుతున్నారంటూ అసత్య కథనాలు ప్రచురించడం పట్ల ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పచ్చ మీడియా తప్పుడు రాతలను నిరసిస్తూ దేవరాపల్లి గ్రామ సచివాలయం–1, 2 పరిధిలోని వలంటీర్లు గురువారం భారీ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వలంటీర్లు ఉల్లి దేముళ్లు, అనిమిరెడ్డి పోతురాజు, ఆతవ జోష్, వరదపురెడ్డి ఉమ, దీవి దేవి, పిల్లా రాజు, మొల్లి ఎర్రినాయుడు తదితరులు మాట్లాడారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా సేవాభావంతో పనిచేస్తున్న తమపై విష ప్రచారం చేయడం సిగ్గు చేటని ధ్వజమెత్తారు. మరోసారి తమపై తప్పుడు రాతలు ప్రచురిస్తే తగిన గుణపాఠం చెబుతామని ఘాటుగా హెచ్చరిక జారీ చేశారు. మండల కేంద్రం దేవరాపల్లిలో ఈనాడు పత్రికలు చేతపట్టి పచ్చమీడియాకు వ్యతిరేకంగా ‘ఈనాడు డౌన్ డౌన్, తప్పుడు రాతలు మానుకోవాలి’ అంటూ నినాదాలు చేశారు. దేవరాపల్లి ప్రధాన రోడ్డులో పచ్చ పత్రికలను దహనం చేసి నిరసన తెలిపారు. ఐక్యంగా ఉన్న తమను రెచ్చగొట్టి చిచ్చు పెట్టేందుకే తప్పుడు వార్తలను ప్రచురిస్తోందని నిప్పులు చెరిగారు.

22న ఓటర్ల జాబితా ప్రచురణ

- 12వ తేదీలోగా అభ్యంతరాల స్వీకరణ
- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



ఆరోగ్యశాఖ వైద్యాధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: వచ్చే నెల 22న జిల్లా ఓటర్ల జాబితా ప్రచురిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఇప్పటివరకు అందిన దరఖాస్తులు, అభ్యంతరాలను పూర్తిగా పరిష్కరించామన్నారు. ఇంకా ఏమైనా అభ్యంతరాలు, నమోదు ఉన్నట్లయితే వచ్చే నెల 12వ తేదీలోగా సమర్పించాలన్నారు. వాటిని 17వ తేదీలోగా పరిష్కరిస్తామన్నారు. ప్రస్తుతం జిల్లాలోని 1,529 పోలింగ్ కేంద్రాల్లో 12 లక్షల 57 వేల 707 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వారిలో 6 లక్షల 13 వేల 144 మంది పురుషులు, 6 లక్షల 44 వేల 516 మంది స్త్రీలు, 47 మంది ఇతరులు ఉన్నట్లు వివరించారు. సమావేశంలో డీఆర్వో బి.దయానిధి, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు లక్ష్మీదేవి, ఎస్ఏ తులసీరామ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పి. సోమేశ్వరరావు, పి.రామకృష్ణ, ఎస్.వి.వి. రామచంద్రరావు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాల శాతం పెరగాలి

వైద్యుల పర్యవేక్షణలో జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు ఎక్కువగా జరగాలని కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన వైద్య ఆరోగ్య శాఖ సమీక్షలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యశ్రీ కేసులు ఎక్కువగా ప్రభుత్వాస్పత్రుల్లోనే చికిత్స చేయాలన్నారు. కష్టతరమైన కాన్పుకు అవకాశం ఉండే గర్భిణులను ముందుగానే ఆస్పత్రులకు తీసుకురావాలన్నారు. అదేవిధంగా స్టాఫ్ నర్సు, ఆశ కార్యకర్తలు వారికి ముందస్తు చికిత్సలు, జాగ్రత్తలు గురించి పూర్తి అవగాహన కలిగించాలన్నారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉండేలా సుఖప్రసవాలు చేయాలన్నారు. తగిన చికిత్స, పౌష్టికాహారం అందించాలన్నారు. వైద్య సిబ్బంది గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో ఎ. హేమంత్, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ అనంతలక్ష్మి, ఆంధ్రా మెడికల్ కాలేజి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యమున, అనకాపల్లి, నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, వైద్యులు పాల్గొన్నారు.

జనవరిలో సంక్షేమ పథకాల జాతర 8లో

న్యూఇయర్ ఈవెంట్లకు అనుమతులు తప్పనిసరి

- ప్రజల భద్రత దృష్ట్యా నియమాలు పాటించాలి
- ఎస్పీ మురళీకృష్ణ ఆదేశాలు



ఎస్పీ మురళీకృష్ణ

సాక్షి, అనకాపల్లి: నూతన సంవత్సర వేడుకలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్పీ మురళీకృష్ణ స్పష్టం చేశారు. వీటికి సంబంధించి జిల్లాలో హోటళ్లు, క్లబ్‌ల నిర్వాహకులకు మార్గదర్శకాలు జారీ చేశారు. కాదని ఎవరైనా నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మార్గదర్శకాలు ఇవే..

- ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సేఫ్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ చట్టం –2013 ప్రకారం నిర్వాహకులు హోటల్, క్లబ్, పబ్ బయటకు/లోపలికి వచ్చే మార్గాలలో, పార్కింగ్ ప్రాంతాల్లో తప్పకుండా సీసీ టీవీ కెమెరాలు, వేడుకలు, కార్యక్రమాల వద్ద ట్రాఫిక్, భద్రత కోసం తగిన సంఖ్యలో సిబ్బందిని నిర్వాహకులే నియమించుకోవాలి. నిర్వాహకులు డీజే/స్పీకర్స్ శబ్దం 45 డెసిబెల్స్‌ను మించకూడదు. కార్యక్రమ వేదిక వద్ద ఎటువంటి బాణసంచా, పేలుడు పదార్థాలను నిర్వాహకులు అనుమతించకూడదు.
- ఎవరూ డ్రగ్స్ లేదా నార్కోటిక్స్, సైకోట్రోపిక్ పదార్థాలను ఉపయోగించకూడదు. సదరు విషయాన్ని కస్టమర్లకు ముందుగా హెచ్చరించాలి. ఎక్సైజ్ శాఖ అధికారులు అనుమతించిన సమయం వరకూ మాత్రమే మద్యాన్ని అందించాలి.
- విదేశీయులు ఎవరైనా ఈవెంట్‌కు హాజరైతే పోలీసులకు సమాచారం అందించాలి.
- నిర్వాహకులు విధిగా కొన్ని సూచనలు, సలహాలతో కార్యక్రమాలు నిర్వహించే ప్రాంగణాల ప్రవేశ ద్వారాల వద్ద, లోపల అందరికీ కనిపించే విధంగా నోటీస్ బోర్డులు ఏర్పాటు చేయాలి.
- తాగి డ్రైవింగ్ చేయడం నేరం. వాహనదారులకు 30 ఎంజీ/100 ఎంఎల్‌కు మించి బ్రీత్ అనలైజర్‌లో రీడింగ్ చూపిస్తే కేసు నమోదు చేస్తారు.
- అటువంటి సందర్భంలో డ్రైవింగ్ లైసెన్స్ ఉండి, మద్యం తాగని వారు ఉంటే వారికి వాహనం ఇస్తారు. లేనిపక్షంలో తాత్కాలిక కస్టడీ కోసం వాహనాన్ని పోలీసు స్టేషన్‌కు తరలిస్తారు.



- సదరు వాహనం ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌తో మరుసటి రోజున పోలీస్ స్టేషన్‌కు వచ్చి వెనక్కి తీసుకోవాలి.
- పోలీసులు సమన్లు పంపించిన సమయంలో కోర్టుకు హాజరు కావాలి. సదరు వాహనదారులపై చార్జ్‌షీట్ దాఖలు చేస్తారు.
- డ్రంక్ అండ్ డ్రైవింగ్ జరిమానాగా రూ. 10 వేలు లేదా 6 నెలల జైలు శిక్ష పడుతుంది. ఓవర్ స్పీడ్‌తో వాహనాల్ని నడపడం, ప్రమాదకరమైన డ్రైవింగ్, బహిరంగ ప్రదేశాల్లో రేసింగ్ శిక్షార్హం అన్నారు.

నా బిడ్డ ఆచూకీ తెలపండి

- పోలీసులు తీసుకెళ్లారని కోర్టును ఆశ్రయించిన మహిళ
- సెర్చ్ వారెంట్ జారీ చేసిన న్యాయమూర్తి
- స్టేషన్‌లో బాధితుడిని గుర్తించిన అడ్వకేట్ కమిషనర్
- పోలీసులు హింసించలేదని తెలిపిన యువకుడు

యలమంచిలి రూరల్: తన కొడుకును మూడు రోజులుగా అక్రమంగా నిర్బంధించి యలమంచిలి రూరల్ పోలీసులు చిత్రహింసలకు గురి చేస్తున్నారంటూ యలమంచిలి పట్టణం ధర్మవరం సీపీ పేటకు చెందిన ప్రగడ అన్నపూర్ణ యలమంచిలి ఏజేఎఫ్‌సీఎం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నెల 26న మధ్యాహ్నం 3 గంటల సమయంలో యలమంచిలి రూరల్ ఎస్సై సన్నిబాబు, మరికొంతమంది పోలీసులు తమ ఇంటికి వచ్చి తన కొడుకును ఎలాంటి వారెంట్ లేకుండా, కారణం చెప్పకుండా బలవంతంగా తీసుకెళ్లిపోయారని, అప్పట్నుంచి తన కొడుకును యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో అక్రమంగా నిర్బంధించారని ఆరోపిస్తూ తమ కుమారుడి ఆచూకీ తెలియడంలేదని, ఇది తన కుమారుడి లాకప్ డెత్‌కు దారి తీయవచ్చని తన పిటిషన్‌లో ఆందోళన వ్యక్తపరిచారు.

పిటిషనర్ వినతి మేరకు యలమంచిలి ఏజేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి టి.వీరరాఘవేంద్రరావు గురువారం సాయంత్రం 5.30 గంటల సమయంలో న్యాయవాది కూనిశెట్టి శ్రీనివాస్‌ను అడ్వకేట్ కమిషనర్‌గా నియమించారు. వెంటనే రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన అడ్వకేట్ కమిషనర్ కూనిశెట్టి శ్రీనివాస్ అక్కడ పిటిషనర్ కుమారుడు ప్రగడ రవితేజను గుర్తించి, అతడిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. తనను పోలీసులు కొద్ది గంటల ముందే అదుపులోకి తీసుకున్నారని, ఎలాంటి థర్డ్ డిగ్రీ ప్రయోగించలేదని ప్రగడ అన్నపూర్ణ కుమారుడు రవితేజ చెప్పినట్టు అడ్వకేట్ కమిషనర్ తెలిపారు. శుక్రవారం పూర్తి వివరాలతో ప్రగడ రవితేజను కోర్టులో హాజరుపర్చాలని యలమంచిలి రూరల్ ఎస్సై సన్నిబాబును న్యాయమూర్తి ఆదేశించారు.

కాగా పలు పాత కేసుల్లో పట్టుబడిన గంజాయిని యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఒక గదిలో భద్రపరిచినట్టు గుర్తించిన కొందరు యువకులు.. గంజాయి భద్రపరిచిన గది వెనుక ఉన్న ఇనుప గ్రిల్స్‌ను తొలగించి పలుమార్లు గంజాయిని దొంగలించినట్టు తెలిసింది. ఈ కేసులోనే రవితేజ నిందితుడిగా ఉండగా తాజా పరిణామాలు చోటుచేసుకున్నాయి.

మైదానం మురిసింది

క్రీడోత్సాహం వెల్లివిరిసింది.. ఆహ్లాదం పరవళ్లు తొక్కింది.. ఏ వేదికా లేని గ్రామీణ క్రీడాకారులకు అవకాశం కల్పించేలా రూపొందించిన ‘ఆడుదాం ఆంధ్రా’ కార్యక్రమానికి చక్కని స్పందన లభిస్తోంది. ఆటగాళ్లు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.



పాయకరావుపేట: మాసాహెబుపేటలో వాలీబాల్ పోటీ



అనకాపల్లి: సిటీ పబ్లిక్ స్కూల్లో ఖోఖో ఆడుతున్న మహిళలు



రావికమతం: కబడ్డీ ఆడుతున్న మహిళా జట్లు

క్లుప్తంగా

ఏలేరు కాలువలో గుర్తు తెలియని బైక్ లభ్యం



కాలువలో నుంచి బయటకు తీసిన ద్విచక్రవాహనం

మాకవరపాలెం: ఏలేరు కాలువలో గుర్తు తెలియని మోటార్ సైకిల్ లభించింది. మండల కేంద్రంలోని బీసీ కాలనీ సమీపంలో ఉన్న ఏలేరు కాలువలో బైక్‌ను గుర్తించిన స్థానికులు గురువారం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రామకృష్ణారావు తన సిబ్బందితో కాలువలో ఉన్న బైక్‌ను బయటకు తీయించారు. బైక్‌కు నంబర్ ప్లేట్లు లేకపోవడంతో ఎవరిదనే విషయం తెలియలేదు. ఇంజిన్ నంబర్ ఆధారంగా వివరాలు సేకరిస్తామని, బైక్‌తో సహా ఎవరైనా కాలువలో పడిపోయారా? లేదా ఎవరైనా కావాలనే కాలువలో బైక్‌ను పడేశారా? అన్న విషయంపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

132 కేజీలు గంజాయి స్వాధీనం



గంజాయి బస్తాలతో స్వాధీనం చేసుకున్న వాహనం

పాయకరావుపేట: తాండవ చక్కెర కర్మాగారం సమీపంలో అక్రమంగా రవాణా జరుగుతున్న 132 కేజీల గంజాయిని, బొలేరో వాహనాన్ని గురువారం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పి.అప్పలరాజు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తాండవ చక్కెర కర్మాగారం వద్ద నర్సీపట్నం నుంచి వస్తున్న వాహనాలను తనిఖీ చేయగా, వాహనంలో 5 బస్తాల గంజాయిని గుర్తించామన్నారు. గంజాయి తరలిస్తున్న వ్యక్తులు చింతపల్లి మండలం, బెన్నవరం గ్రామానికి చెందిన బల్లారి దావీదు బాబు, వర్ధన దిలీప్ కుమార్‌లతోపాటు గంజాయిని, వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

జనవరిలో సంక్షేమ పథకాల జాతర

- సీఎం వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



సంక్షేమ పథకాల పంపిణీపై సీఎం జగన్ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, పెట్ల ఉమా శంకర గణేష్

తుమ్మపాల: కొత్త సంవత్సరంలో జనవరి 1 నుంచి ఫిబ్రవరి 14 వరకు పంపిణీ చేయనున్న వైఎస్సార్ పింఛన్ కానుక, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత కార్యక్రమాలను ఉత్సవ వాతావరణంలో పెద్ద జాతరలా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాల్సిందిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించినట్లు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో సీఎం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి ఆయనతో పాటు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్యేలు గొల్ల బాబురావు, పెట్ల ఉమాశంకర్ గణేష్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 19న విజయవాడలో సామాజిక న్యాయానికి ప్రతిరూపంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ ఉత్సవానికి ప్రతి సచివాలయం నుంచి ఐదుగురిని ఎంపిక చేసి పంపిస్తామన్నారు. జనవరి 1 నుంచి జిల్లాల్లో నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమంలో ప్రతి వారం, ప్రతి మండలంలోని ఒక సచివాలయ పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించి, ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తామన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో అందించే ఉచిత వైద్యసేవల పట్ల ప్రజలందరికీ పూర్తి అవగాహన కల్పించేలా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ శచీదేవి, గ్రామ/వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి మంజులవాణి, సీపీవో జి.రామారావు పాల్గొన్నారు.

పొదుపుతోనే జీవితాల్లో వెలుగు

- ఆర్థిక అక్షరాస్యతపై ఆర్బీఐ ఏజీఎం హనుమకుమారి అవగాహన



మాట్లాడుతున్న ఆర్బీఐ ఏజీఎం హనుమకుమారి

కె.కోటపాడు: ప్రతి ఒక్కరూ ఆర్థిక పొదుపు పాటించడంతోనే జీవితాల్లో వెలుగు పొందవచ్చునని ఆర్బీఐ ఏజీఎం కె.హనుమకుమారి అన్నారు. వికసిత్ భారత్‌లో భాగంగా ఏపీజీవీబీ మేనేజర్ కె.శ్రావణ్‌బాబు ఆధ్వర్యంలో గురువారం మండలంలోని పాచిలవానిపాలెంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏజీఎం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతాలతోపాటు ఏటీఎం కార్డులను పొందాలని సూచించారు. డ్వాక్రా మహిళలు ప్రతి నెలా సమావేశమై వివరాలను రిజిష్టర్‌లో నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ విధంగా చేయడం వల్ల అక్షరాస్యత లేని మహిళలు మోసపోయే పరిస్థితి ఉండదని తెలిపారు. పాడి రైతులకు 35 శాతం రాయితీపై పశువుల కొనుగోలుకు రుణాలు ఇస్తున్నామన్నారు. వ్యవసాయ రుణాలను సకాలంలో చెల్లిస్తే ప్రభుత్వ వడ్డీ రాయితీ వర్తిస్తుందన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ కె.సత్యనారాయణ మాట్లాడుతూ 50 ఏళ్ల లోపు వారు ఏడాదికి పీఎంజేజేబీవై కింద రూ.436 చెల్లించాలని తెలిపారు. వీరికి సహజ మరణం సంభవిస్తే రూ.2 లక్షల బీమా వస్తుందన్నారు. పీఎంఎస్‌బీవై కోసం 70 ఏళ్ల లోపు వారు ఏడాదికి రూ.20 చెల్లించాలని తెలిపారు. ప్రమాద సమయాల్లో మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల బీమా వస్తుందన్నారు. అటల్ పెన్షన్ యోజనలో 18 నుంచి 39 ఏళ్లలోపు వారు ప్రతి నెలా నిర్దిష్ట మొత్తాన్ని చెల్లిస్తే వారికి 60 ఏళ్లు దాటిన తర్వాత ప్రతి నెలా పెన్షన్ చెల్లిస్తామని మేనేజర్ శ్రావణ్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, అనకాపల్లి రీజనల్ కార్యాలయ సిబ్బంది టి.ఆనంద్ పాల్గొన్నారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య



మృతుడు శివాజీ

నక్కపల్లి: మద్యానికి బానిసైన ఓ యువకుడు గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తండ్రి సత్తిబాబు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు. మండలంలోని ఉపమాకకు చెందిన పొన్నాడ శివాజీ(20) ఆటో డ్రైవర్. మద్యం అలవాటును విడనాడాలని తండ్రి సత్తిబాబు తరచూ చెప్పేవారు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చిన్న కుమారుడు చూసి పనులకు వెళ్లిన తండ్రికి సమాచారం ఇచ్చాడు. వెంటనే ఇంటికి వచ్చి, ఫ్యాన్‌కు వేలాడుతున్న శివను దించి, ఆస్పత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మరణించినట్లు డాక్టర్ నిర్ధారించారు. తమ కుమారుడు మద్యానికి బానిసై ఆత్మహత్యకు పాల్పడ్డాడని, వేరే కారణాలు లేవని తండ్రి తెలిపారు. పోస్టుమార్టం చేసి, మృతదేహాన్ని అప్పగించాలని ఫిర్యాదులో తండ్రి పేర్కొన్నట్లు పోలీసులు వెల్లడించారు.

1 నుంచి నాగులాపల్లి పీఏసీఎస్ శత సంవత్సర ఉత్సవాలు



వివరాలు తెలుపుతున్న నాగులాపల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఉమామహేశ్వరరావు

మునగపాక: మండలంలోని నాగులాపల్లి పీఏసీఎస్ శత సంవత్సర సహకార ఉత్సవాలు జనవరి 1న ప్రారంభమవుతాయని సంఘ పర్సన్ ఇన్‌చార్జి మళ్ల ఉమామహేశ్వరరావు తెలిపారు. గురువారం సంఘ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1925లో దివంగత మల్ల రామునాయుడు వ్యవస్థాపక అధ్యక్షునిగా సంఘం ప్రారంభమైందన్నారు. ఇంత వరకు సంఘ అధ్యక్షులుగా 8 మంది సేవలందించినట్లు తెలిపారు. డిపాజిట్ల సేకరణ, రైతులకు రుణాలు, ఎరువుల మంజూరు, ధాన్యం సేకరణ, నిత్యావసర సరకుల పంపిణీ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే రాష్ట్ర, జిల్లా స్థాయిలో పలు బహుమతులు అందుకున్నట్లు పేర్కొన్నారు. 15 శాతం డివిడెండ్, మరణించిన సభ్యుల దహన ఖర్చుల కింద సాయం వంటివి అందుబాటులోకి తెచ్చామన్నారు. రైతుల సహకారంతో సంఘాన్ని మరింత అభివృద్ధి చేస్తూ, జిల్లాలో లాభాల బాటలో పయనించే సొసైటీగా గుర్తింపు తీసుకొచ్చినట్లు తెలిపారు. సమావేశంలో డైరెక్టర్లు నరాలశెట్టి బాబూరావు, కొయిలాడ ఎర్రయ్యనాయుడు, సంఘ కార్యదర్శి మళ్ల స్వామి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆస్పత్రిలో ముగిసిన ముస్కాన్ బృంద పరిశీలన



చిన్నారి కేస్ షీట్‌ను పరిశీలిస్తున్న శ్రీరాం

అనకాపల్లి: రెండు రోజులుగా స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయాన్ని పరిశీలించి, గమనించిన అంశాలపై నివేదికను తయారు చేసి కేంద్రానికి సమర్పించనున్నట్లు ముస్కాన్ బృందం వైద్యులు సి.శ్రీరాం(బెంగళూర్), అమిత్‌కుమార్(ఉత్తర ప్రదేశ్)లు తెలిపారు. బుధ, గురువారాలు వైద్యాలయంలో ఈ బృందం చిన్నపిల్లలు, గర్భిణుల వార్డులను నిశితంగా గమనించింది. చిన్నారులకు, బాలింతలకు అందిస్తున్న ఆహారంపై ఆరా తీసి, ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది పనితీరును పరిశీలించింది. రెండు రోజుల పరిశీలనతో ఈ బృందం ఆస్పత్రిపై తుది నివేదిక ఇచ్చేందుకు సిద్ధమయింది. ఈ బృందం వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు, ఆర్ఎంవో లక్ష్మణశ్రీనివాస్, జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి మణికంఠ, చిన్నపిల్లల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణ సమగ్రాభివృద్ధే ధ్యేయం

- రూ.2.20 కోట్లతో రైల్వే స్టేషన్ రోడ్డు విస్తరణకు ఎమ్మెల్యే కన్నబాబు శంకుస్థాపన



రైల్వేస్టేషన్ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణ సమగ్రాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కన్నబాబు అన్నారు. గురువారం సాయంత్రం పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. వీఎంఆర్డీఏ నిధులు రూ.2.20 కోట్లతో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రైల్వేస్టేషన్ వరకు రహదారి విస్తరణ పనులు చేయిస్తున్నామన్నారు. సుమారు 650 మీటర్ల పొడవున రహదారి విస్తరణ, ఆధునికీకరణ పనులు రెండు నెలల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కాంక్రీట్ రోడ్డు పనులు పూర్తయితే పట్టణ వాసుల రాకపోకలు మరింత సౌకర్యవంతంగా ఉంటాయన్నారు. పనుల్లో నాణ్యతాలోపం లేకుండా నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని టెండర్ పొందిన శ్రీలక్ష్మీ నిర్మాణ సంస్థ ప్రతినిధులకు సూచించారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పట్టణాభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, వీఎంఆర్డీఏ చీఫ్ ఇంజినీర్ పి.శివప్రసాద్‌రాజు, ఎస్ఈ వి.భవానీశంకర్, డీఈ వీఆర్‌వీ రవిశంకర్, మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు సత్య గుప్తా, బెజవాడ నాగేశ్వరరావు, ఎంపీపీ బోదెపు గోవిందు, మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు ఎర్రయ్యదొర, పార్టీ నాయకులు సేనాపతి రాము, కొల్లి త్రినాథ్, పలువురు వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డులో ఆర్టీసీ బస్సులు ఢీ

- మహిళకు తీవ్రగాయాలు
- ట్రాఫిక్‌కు అంతరాయం



ఢీకొన్న రెండు ఆర్టీసీ బస్సులు

పాడేరు: ఘాట్‌రోడ్డులోని 12వ మైలు రాయి మలుపు వద్ద గురువారం రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొనడంతో ఓ మహిళకు తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో రెండు బస్సుల్లో ఎక్కువమంది ప్రయాణికులు ఉన్నారు. అందరూ సురక్షితంగా బయటపడ్డారు. వివరాలు. పాడేరు ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు సుమారు 30మంది ప్రయాణికులతో విశాఖ వెళుతోంది. అదే సమయంలోని అనకాపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు 43 మంది ప్రయాణికులతో జోలపుట్టువైపు వస్తోంది. పాడేరు–చోడవరం ఘాట్‌రోడ్డులోని 12వ మైలు రాయి మలుపువద్ద రెండు బస్సులు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అనకాపల్లి జిల్లా వి.మాడుగుల మండలం కోడూరు గ్రామానికి చెందిన సంతల్లో వ్యాపారం చేసుకునే పతాల పైడితల్లిమ్మ(55) అనే మహిళ తలకు తీవ్ర గాయమైంది. మిగిలిన వారికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో ప్రయాణికులు, ఆర్టీసీ అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం

- గోవాడలో ప్రాధాన్యతా భవనాల ప్రారంభోత్సవంలో విప్ ధర్మశ్రీ



గోవాడ గ్రామంలో నిర్మించిన ఆర్బీకే భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన దేశానికే ఆదర్శమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. గోవాడ గ్రామంలో రూ.48 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.28 లక్షలతో పూర్తి చేసిన రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే), రూ.18 లక్షలతో నిర్మించిన హెల్త్ సెంటర్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ గురువారం ప్రారంభించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ధర్మశ్రీ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు అమలు చేయడంతోపాటు గ్రామ స్వరాజ్య స్థాపనకు గ్రామాల అభివృద్ధికి అన్ని విధాలా సీఎం జగన్ కృషి చేస్తున్నారని కొనియాడారు. కొత్తగా సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో పూర్తి స్థాయిలో ప్రభుత్వ సేవలో ప్రజల ముంగిటకే అందుతున్నాయన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటులో దేశానికి మన రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందన్నారు. గ్రామ స్థాయిలో ప్రాథమిక వైద్యానికి వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, రైతులకు సాగు సంబంధిత అవసరాల కోసం ఆర్బీకేలు, పంటల నిల్వకు మినీ కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేసి అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన అన్ని సేవల్ని తమ ప్రభుత్వం అందిస్తోందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో గెలిపించి, మళ్లీ జగన్‌మోహన్ రెడ్డిని సీఎం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, ఎంపీటీసీ కోటి భూలోక, మండల అధ్యక్షుడు దొడ్డి వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు సత్యారావు, బొడ్డేడ సూర్యనారాయణ, వైద్యాధికారి దమయంతి, వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై వెంకన్న తిరువీధి సేవ



గరుడ వాహనంపై స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి: ధనుర్మాస అధ్యయనోత్సవాల్లో భాగంగా ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం గరుడ వాహనంపై స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహించారు. ఉదయం కొండపై స్వామివారి మూల విరాట్‌కు నిత్యాభిషేకం, అర్చనలు జరిపారు. దిగువన క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామి, గోదాదేవి, స్వామివారి ఉత్సవమూర్తులకు, ఉపాలయాల్లోనూ నిత్యార్చనలు, నిత్యకార్యక్రమాలు పూర్తిచేసిన అనంతరం గోదాదేవి అమ్మవారిని పెద్ద పల్లకిలోను, స్వామివారిని గరుడ వాహనంలో అధిష్టంపజేసి, గ్రామంలో తిరువీధి సేవలు నిర్వహించారు. అనంతరం గోదాదేవి అమ్మవారి సన్నిధిలో నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి, తిరుప్పావై 13వ పాశురం పుళ్లిన్వాయ్ కీన్డానై పొల్లా అరక్కనై.. పాడుతూ, ప్రత్యేక నీరాజనాలు సమర్పించారు. అనంతరం తీర్థగోష్టి నిర్వహించి భక్తులందరికీ ప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం రాపత్తు అధ్యయనోత్సవాల్లో భాగంగా రాజాధిరాజ వాహనంలో స్వామివారికి తిరువీధి సేవ నిర్వహించారు. అనంతరం నాలాయిర దివ్య ప్రబంధం సేవాకాలం నిత్య కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీవీ శేషాచార్యులు, నందూరి రాజగోపాలాచార్యులు, రేజేటి సింగాచార్యులు పాల్గొన్నారు.

త్వరలో తాండవ ప్రధాన గేట్లకు మరమ్మతులు

- గేట్ల లీకేజీలను పరిశీలించిన మెకానికల్ డీఈ గోపాలకృష్ణ



తాండవ ప్రాజెక్ట్ ప్రధాన గేట్లను పరిశీలిస్తున్న ప్రాజెక్ట్ డీఈ అనురాధ, మెకానికల్ డీఈ గోపాలకృష్ణ

నాతవరం: తాండవ రిజర్వాయర్ ప్రధాన గేట్ల మరమ్మతులకు రూ.20 లక్షలతో ప్రతిపాదనలు చేసినట్లు ప్రాజెక్ట్ డీఈ అనురాధ తెలిపారు. గేట్ల లీకేజీ పనులు చేసేందుకు రాష్ట్రంలో అనుభవం ఉన్న మెకానికల్ డీఈ గోపాలకృష్ణ, జేఈ ఉషశ్రీకు గేట్లను గురువారం స్వయంగా చూపించారు. తాండవ ప్రాజెక్ట్ నిర్మాణం నుంచి ప్రధాన గేట్లకు మరమ్మతులు చేయలేదు. దీంతో చాలాకాలం నుంచి గేట్లు లీకేజీ అవుతున్నాయి. మరమత్తులు చేయలేదు, దింతో ఏంత కాలం నుంచి గేట్లు నుంచి లీకేజీ అవుతున్నాయో.. అడిగి తెలుసుకున్నారు. గేట్ల మరమ్మతులు చేపట్టేందుకు కావాల్సిన సామగ్రిని సమకూర్చాల్సిందిగా అధికారులను సూచించారు. అనంతరం డీఈ గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి మట్టం తక్కువగా ఉన్నందుకు ప్రధాన గేట్ల మరమ్మతులు చేసేందుకు అనువుగా ఉందన్నారు. ఉన్నతాధికారుల అదేశాల మేరకు త్వరలోనే గేట్లకు మరమ్మతు పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రాజెక్ట్ డీఈ అనురాధ మాట్లాడుతూ ప్రధాన గేట్ల లీకేజీ పనులతో పాటు ఇతర మరమ్మతులు కూడా చేపట్టేందుకు రూ.20 లక్షలతో ప్రతిపాదనలు చేశామన్నారు. నిధుల సత్వర మంజూరుకు ఉన్నతాధికారులు ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. వారి వెంట ప్రాజెక్ట్ జేఈ రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

మార్గశిర శోభ

- కనకమహాలక్ష్మి ఆలయానికి పోటెత్తిన భక్తులు
- ఘనంగా మూడో గురువారం పూజలు



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

డాబాగార్డెన్స్(విశాఖ): శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మార్గశిర మాసం మూడో గురువారం అమ్మవారి దర్శనానికి రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. బుధవారం అర్ధరాత్రి నుంచే అమ్మవారి దర్శనానికి బారులు దీరారు. మేళతాళాలు, మంగళవాద్యాల నడుమ అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు, సహస్ర నామార్చనలు జరిపారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వేద మంత్రాలు, నాదస్వరాలతో ముందుగా గణపతి పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరణలు, వేద పారాయణాలు, శ్రీచక్రార్చన లక్ష్మీ హోమం తదనంతరం అమ్మవారికి విశేష పూజ నిర్వహించారు. పరిసర ప్రాంతాల ప్రజలు తీసుకొచ్చిన పసుపు కుంకుమ నీళ్లతో జలాభిషేకం జరిపారు. పెద్ద ఎత్తున క్షీరాభిషేకం నిర్వహించి పసుపు పూశారు. తర్వాత అమ్మవారికి స్వర్ణాభరణ అలంకరణ చేశారు. అర్ధరాత్రి 12.05 నుంచి 1.30 గంటల వరకు ఈ అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం వెండి కవచాలు తొడిగారు. మధ్యాహ్నం 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి మహానివేదన(రాజభోగం), 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్వదర్శనం, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు పంచామృతాభిషేక సేవ, సహస్రనామార్చన, స్వర్ణాభరణ అలంకరణ, రాత్రి 7 నుంచి సర్వదర్శనం కల్పించారు. ఆలయ ఈవో శిరీష, ఏఈవో తిరుమలేశ్వరరావు, వన్‌టౌన్ పోలీసులు ఏర్పాట్లను పరిశీలించారు.

ప్రత్యేక ఏర్పాట్లు..

భక్తులకు దేవస్థానం అధికారులు మంచినీటి సౌకర్యం కల్పించారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వేలాది మంది భక్తులకు భోజన ఏర్పాట్లు చేశారు. రీడింగ్ రూమ్ వద్ద ధర్మ దర్శనంతో పాటు రూ.100, రూ.200 టికెట్లు తీసుకున్న భక్తులకు క్యూల్లో పంపించారు. సీతారామస్వామి ఆలయం వైపు వీవీఐపీ, వీఐపీతో పాటు వృద్ధులు, వికలాంగులు, రూ.500 టికెట్ తీసుకున్న వారికి దర్శనం కల్పించారు. అమ్మవారి ఆలయ వెనుకభాగం, ఆలయ ప్రధాన ద్వారం, దర్శనం అనంతరం బయటకు వచ్చే మార్గంలో ప్రసాద కౌంటర్లు విక్రయించారు. టూ వే కావడంతో వాహన రాకపోకలు ఎక్కడికక్కడ నిలిచిపోయి.. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. భక్తుల సౌకర్యార్థం సింహాచలం, మధురవాడ నుంచి ఉచిత బస్సు సర్వీసులు నడిపినట్లు ఆలయ ఈవో తెలిపారు.

వేచలం, ఎం.అలమండ గ్రామాల్లో చోరీలు

- 11 తులాల బంగారం, రూ.50 వేల నగదు అపహరణ
- సంఘటనా స్థలాలను పరిశీలించిన డీఎస్పీ సుబ్బరాజు



దొంగతనం జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న డీఎస్పీ సుబ్బరాజు, సిబ్బంది

దేవరాపల్లి: మండలంలోని రెండు గ్రామాల్లో బుధవారం జరిగిన దొంగతనాలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. రైతులు పొలాల్లోకి వెళ్లిన తర్వాత ఇళ్ల తాళాలతో, పాటు బీరువా తాళాలను పగులగొట్టి 11 తులాల బంగారం, రూ.50 వేలు నగదు చోరీ చేశారు. స్థానిక మీడియాకు ఎస్ఐ డి.నాగేంద్ర తెలిపిన వివరాలు. వేచలం గ్రామానికి చెందిన బొడ్డు లక్ష్మి కుటుంబ సభ్యులు ఇంటికి తాళాలు వేసి, పొలం పనికి వెళ్లారు. పొలం నుంచి ఇంటికి చేరుకోగా తలుపులు తీసి ఉండటాన్ని గుర్తించారు. ఇంటిలోకి వెళ్లి చూడగా రెండు బీరువాలు తెరిచి, వాటిలో తాము దాచుకున్న ఎనిమిదిన్నర తులాల బంగారు నగలు, రూ.50 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఇదే తరహాలో ఎం.అలమండలో పూరిశెట్టి అప్పారావు ఇంట్లో కూడా చోరీ జరిగింది. కుటుంబ సభ్యులు ఇంటికి తాళాలు వేసి పొలం పనికి వెళ్లి, తిరిగి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లో ఉన్న బీరువాలో దాచిన రెండున్నర తులాల బంగార పుస్తెలతాడు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు. ఒకేసారి రెండు గ్రామాల్లో దొంగతనం జరగడంతో అనకాపల్లి డీఎస్పీ వి.సుబ్బరాజు, ఇన్‌చార్జి సీఐ కుమారస్వామి సంఘటనా స్థలాలకు వెళ్లి, విచారణ చేపట్టారు. క్లూస్ టీమ్, జాగిలాలతో ఆధారాలు సేకరించారు.

క్లుప్తంగా

ఎండీఎం వంట పాత్రల అందజేత



వంట పాత్రలను అందిస్తున్న లగిశెట్టి గణేష్

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకం (ఎండీఎం) కార్మికులకు రూ.50 వేలతో వంట పాత్రలను ప్రభుత్వం సమకూర్చింది. వీటిని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్ గురువారం పాఠశాలకు అందించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ అధ్యక్షుడు గుమ్మడి గోవింద్, పాల సంఘం అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు పాల్గొన్నారు.

కార్మికుల జీతాలు చెల్లింపు

తుమ్మపాల: మండలంలోని కొత్తూరు పంచాయతీ కార్మికులకు రెండు నెలల బకాయి జీతాలను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు గురువారం అందించారు. ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వైఎస్ భద్రం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా చేశారు. తమకు నాలుగు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదంటూ చేపట్టిన ధర్నాకు అధికారులు స్పందించి, రెండు నెలల జీతం అందించారు. మిగతా రెండు నెల జీతాలు జనవరిలో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు కలిగొట్ల నాయుడు, చెవ్వేటి నేస్తాలు, పొట్లూరు గణేష్, కారు సత్తిబాబు, తోట నాగేశ్వరరావు, పెదపూడి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

మరిడిమాంబకు వెండి వస్తువుల అందజేత



వెండి ఆభరణాల అలంకరణతో మరిడిమాంబ అమ్మవారు

తుమ్మపాల: మండలంలో రేబాక గ్రామంలో వేంచేసియున్న శ్రీ మరిడిమాంబ అమ్మవారికి కొత్తపల్లి నాగేశ్వరరావు, మంత్రి ఉమా సత్యనారాయణ దంపతులు రూ.10 వేల వెండి వస్తువులు, శతమానాలు అందించారు. వెండితో నొత్తు, ముక్కుపుడక, బొట్టు, శతమానాలు, జుంకాలు తయారుచేయించి గురువారం అమ్మవారికి అలంకరించారు. అనంతరం అమ్మవారికి పూజలు చేసి, మొక్కు తీర్చుకున్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 4,132 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,050	5,000
రెండో రకం	3,800	4,580
మూడోరకం	3,600	3,900

అనకాపల్లి సినిమాలు

బబుల్ గమ్	రాజా
ఉమాపతి	సత్యనారాయణస్క్రీన్-1
ఆక్వామెన్(తెలుగు-3డీ)	సత్యనారాయణస్క్రీన్-2
డెవిల్	షిర్డిసాయి
సలార్	పర్తిసాయి
మంగళవారం	వెంకటేశ్వర
తికమక తాండ	శ్రీసత్య
సలార్	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 67 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బీ పాజిటివ్-17 యూనిట్లు, ఓ పాజిటివ్-38 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 447 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 402 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

జగనన్న కాలనీలు ఆనందాల లోగిళ్లు





ఈమె పేరు పెదపాటి ఉమ. సొంత ఇల్లు లేదు. కశింకోటలోని గవరపేటలో సుమారు 20 ఏళ్లుగా అద్దె ఇంటిలోనే ఉండేవారు. భర్త కిషోర్ బంగారం వస్తువుల తయారీ పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. వీరికి ఒకటో తరగతి, 4వ తరగతి చదువుతున్న ఇద్దరు అబ్బాయిలు. ఇన్నాళ్లూ సంపాదించిన దాంట్లో చాలా భాగం అద్దెకే వెళ్లిపోయేది. సీఎం జగన్ ప్రభుత్వంలో వీరి అద్దె ఇంటి కష్టాలకు చెక్ పడింది. స్థానిక వడ్డివీధిలో జగనన్న మెగా లేఅవుట్‌లో వీరికి ఇంటి స్థలం మంజూరైంది. ఇల్లు నిర్మించుకునేందుకు రూ.1.80 లక్షల ఆర్థిక సాయం, నిర్మాణ సామగ్రి అందించారు. మిగిలిన సొమ్మును సమకూర్చుకుని, తమ సొంతింటి కలను నెరవేర్చుకున్నట్లు ఉమ ఆనందంగా చెప్తోంది. ఆరు నెలల క్రితం గృహప్రవేశం చేసి ఇక్కడే ఉంటున్నామని, అద్దె బాధలు తప్పాయంటూ సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



కశింకోట పూసర్ల వీధికి చెందిన పెంటకోట శ్రీనివాసరావుకు సొంత ఇల్లు లేదు. మోటార్ మెకానిక్‌గా పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. భార్య లలిత స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్నారు. వీరికి రిషికేష్ అనే కుమారుడు. 9వ తరగతి చదువుతున్నాడు. 2008 నుంచి అద్దె ఇళ్లలోనే వీరు నివాసం ఉంటున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి స్థలాల కోసం దరఖాస్తు పెట్టుకున్నారు. వీరికి వడ్డివీధిలోని జగనన్న లేఅవుట్‌లో ఇంటి స్థలం మంజూరైంది. అధికారుల సూచనలతో ఇంటి నిర్మాణానికి పూనుకున్నారు. విడతల వారీగా ప్రభుత్వం ఇస్తామన్న రూ.1.80 లక్షల మొత్తం ఠంచనుగా బ్యాంక్ ఖాతాలో చేరింది. నిర్మాణ సామగ్రిని కూడా తక్కువ ధరకే ప్రభుత్వం అందించినట్లు శ్రీనివాసరావు చెప్పారు. ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని నాలుగు నెలలుగా నివాసం ఉంటున్నారు.

మనకంటూ ఓ సొంత ఇల్లు ఉంటే చాలు. కష్టాలెన్నున్నా.. కలోగంజో తాగుతూ గుట్టుగా బతికేయొచ్చు. పేద, మధ్య తరగతి ప్రజల చిరకాల వాంఛ ఇదే. సీఎం జగన్ రూపంలో పేదల సొంతింటి కల కార్యరూపం దాల్చింది. వైఎస్సార్–జగనన్న కాలనీలతో అర్హులైన వారందరికీ ఇంటి స్థలం, ఇల్లు నిర్మించుకునేందుకు అవసరమైన సాయం అందింది. దీంతో కశింకోట మండలంలోనే 516 ఇళ్ల నిర్మాణం జరుగుతోంది.

- కశింకోటలో ఐదు లేఅవుట్లు.. 516 గృహాలు
- వడ్డివీధి మెగా లేఅవుట్‌లో 315 ఇళ్ల నిర్మాణం

కశింకోట: మండలంలో వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. మంజూరైన గృహాల్లో ఇప్పటికే సగం నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలినవి నిర్మాణంలో ఉన్నాయి. ఐదు లేఅవుట్లలో 516 ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టారు. వీటిలో వడ్డివీధి మెగా లేఅవుట్‌లో అత్యధికంగా 315 మందికి ఇళ్ల స్థలాలు మంజూరయ్యాయి. ఇవి కాకుండా అదనంగా సొంత స్థలాలు ఉన్న వారికి కూడా ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.లక్షా 80 వేలు మంజూరు చేసి, సాయపడింది. నిర్మాణ సామగ్రిని కూడా అందించింది.

మంత్రి అమర్‌నాథ్ చొరవ

మేజర్ పంచాయతీ కశింకోటలో సుమారు 20 వేల జనాభా ఉన్నారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఈ పంచాయతీపై ప్రత్యేక దృష్టి సారించి అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయించారు. ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో రైతుల నుంచి భూములను కొనుగోలు చేసి లేఅవుట్‌లు వేశారు. గృహనిర్మాణాలకు కూడా అధికారుల్ని ఎప్పటికప్పుడు ఆదేశిస్తూ, లబ్ధిదారుల్ని ప్రోత్సహించారు. ఇళ్లు నిర్మించుకున్న వారికి ఉచిత విద్యుత్ కనెక్షన్, లేఅవుట్ వీధుల్లో విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. దీంతో రెండేళ్ల క్రితం నుంచి గృహప్రవేశాలు మొదలయ్యాయి. మౌలిక వసతులు ఏర్పాటు చేయడంతో లబ్ధిదారులు క్రమేపీ ఇళ్లలో చేరి తమ కుటుంబాలతో ఆనందంగా జీవిస్తున్నారు. అద్దె ఇబ్బందుల్ని తప్పించి, సొంతింటి కల సాకారం చేసినందుకు సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటామని చెప్తున్నారు.



జగనన్న కాలనీలో లబ్ధిదారు అందంగా నిర్మించుకున్న ఇల్లు



కశింకోటలోని వడ్డి వీధి వైఎస్సార్ జగనన్న మెగా లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న గృహాలు

మండలంలో జగనన్న లేఅవుట్లు

వడ్డివీధి మెగా లే అవుట్	కోటదిబ్బ లే అవుట్	గాడివీధి లే అవుట్
315 గృహాలు	37 గృహాలు	67 గృహాలు
సత్తెమ్మకాలనీలో 2 లే అవుట్లు	97 గృహాలు	



లేఅవుట్‌లో వీధి దీపాల ఏర్పాటు

అద్దె బెంగ తీరింది



మాకంటూ సొంత ఇల్లు లేదు. పదేళ్లుగా పూసర్ల వీధిలోని అద్దె ఇంట్లోనే నివాసం ఉండేవాళ్లం. జగనన్న కాలనీలో దరఖాస్తు చేసుకున్న వెంటనే, అర్హతల్ని పరిశీలించి ఇంటి స్థలం కేటాయించారు. ఇంటి నిర్మాణానికి ఎప్పటికప్పుడు ప్రభుత్వం నుంచి రావాల్సిన మొత్తాన్ని బ్యాంకుల్లో వేశారు. రెండేళ్ల క్రితమే ఇల్లు కట్టుకుని, మొదటగా గృహప్రవేశం చేసి, నివాసం ప్రారంభించింది మేమే. ఇపుడు రోడ్లు, వీధి లైట్లు, నీటి వసతి అన్నీ ఉన్నాయి. అద్దె కట్టాలనే బెంగ లేదు. మా సొంతింటి కల జగనన్నతో తీరింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– పి.రాజేష్, కశింకోట

వామనుడిగా ధ్యాన వేంకటేశుడు



వామనావతారంలో ధ్యాన వేంకటేశ్వర స్వామి

కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి గురువారం వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా విష్ణుమూర్తి ఐదవ అవతారం వామనుడిగా అలంకరించి పూజలు జరిపారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారు.

తుది దశకు కల్యాణ మండపం పనులు



నిర్మాణం పూర్తి చేసుకుంటున్న కల్యాణ మండపం

కశింకోట: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద రూ.కోటిన్నరతో కొత్తగా నిర్మిస్తున్న కల్యాణ మండపం నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చొరవతో అరబిందో ఫార్మా పరిశ్రమ సీఎస్సార్ నిధులతో దీన్ని నిర్మిస్తున్నారు. త్వరితగతిన తుది మెరుగులు పూర్తి చేసి త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. ఇది అందుబాటులోకి వస్తే సరైన కల్యాణ మండపం లేక ఇబ్బంది పడుతున్న స్థానికులకు, సమస్య తీరనుంది.

వేతన బకాయిలు చెల్లించాలి

అనకాపల్లి: మండలంలోని తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఫ్యాక్టరీ ఎంప్లాయీస్ యూనియన్ మాజీ ప్రధాన కార్యదర్శి బుద్ద రాంశంకర్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా బకాయిపడిన సుగర్ ఫ్యాక్టరీ నిధులను విడుదల చేశారని తెలిపారు. ఇప్పటికే నాలుగు ఫ్యాక్టరీల కార్మికులకు నగదు చెల్లించారన్నారు. తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ కార్మికుల బకాయిలు రూ.5 కోట్లు కూడా చెల్లించి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలన్నారు.

హోరాహోరీగా ఆడుదాం ఆంధ్రా..



బయ్యవరంలో వాలీబాల్ పోటీలో క్రీడాకారులు



కశింకోట బాలికల హైస్కూల్‌లో నిర్వహించిన ఖోఖో పోటీలు

కశింకోట: మండలంలోని పలు గ్రామాల్లో ఆడుదాం ఆంధ్రా.. క్రీడలపోటీలు వరుసగా మూడో రోజు గురువారం కూడా ఉత్సాహంగా సాగాయి. కశింకోటలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన క్రికెట్ పోటీల్లో నాలుగు సచివాలయాల నుంచి 11 జట్లు పాల్గొన్నాయి. బాలికల హైస్కూల్‌లో ఖోఖో పోటీలు నిర్వహించారు. 4 జట్లు పోటీపడ్డాయి. పీడీలు వి.ప్రభాకరరావు, పెంటకోట కమల పోటీలను నిర్వహించారు. బయ్యవరం హైస్కూల్లో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో మూడు జట్లు పాల్గొని, తమ ప్రతిభ ప్రదర్శించాయి. ఈ పోటీలను పీడీ కృష్ణ పర్యవేక్షించారు. తాళ్లపాలెంలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. నరసింగబిల్లి, కొత్తపల్లి తదితర చోట్ల కూడా క్రీడల పోటీలు ఘనంగా జరిగాయి.

సీతారాములకు పంచామృతాభిషేకం

అనకాపల్లి: స్థానిక నెయ్యిలవీధి శ్రీసీతారామ స్వామి ఆలయంలో గురువారం స్వామివారికి పంచామృతాభిషేకం నేత్రపర్వంగా జరిగింది. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిపినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తెల్లవారుజామున ఆలయానికి భక్తులు అధికసంఖ్యలో చేరుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పట్టణంలోని వేల్పులవీధి షిర్డీసాయి సేవాసంస్థానంలో బాబావారికి క్షీరాభిషేకం నిర్వహించారు. అంతకు ముందు భక్తులకు బాబా ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు.



పంచామృతాభిషేకంలో శ్రీరాముడు



ప్రత్యేక అలంకరణలో షిర్డీసాయిబాబా

కనకమహాలక్ష్మీ నమోస్తుతే



ప్రత్యేక అలంకరణలో కశింకోటలోని కనకమహాలక్ష్మి



ఆలయం బయట అమ్మవారికి భక్తుల పూజలు

కశింకోట: కశింకోటలోని గవరపేటలో ప్రసిద్ధి చెందిన కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయం గురువారం భక్తులతో కిటకిటలాడింది. మార్గశిర మాసం 3వ గురువారం పురస్కరించుకుని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బారులు తీరారు. అమ్మ వారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. అమ్మవారికి వేకువ జామున పాలతో అభిషేకం నిర్వహించారు. అందంగా పూల మాలలు, నూతన వస్త్రాలతో అలంకరించారు. ప్రత్యేక కుంకుమార్చనలు, పూజలు జరిపారు. ఆరుబయట అమ్మవారి విగ్రహానికి తొలుత పూజలు చేసి, అనంతరం అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. చీరలు, రవికెలు, గాజులు, అరటి గెలల రూపంలో మొక్కుబడులు చెల్లించారు. ఆలయ అర్చకులు వి.చిదంబరం, వి.కృష్ణల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పురోహితుడు ఎస్.ప్రశాంత్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు భీశెట్టి కుమార్, ప్రతినిధి సూరిశెట్టి రేవతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మెహర్‌బాబా కేంద్రం వార్షికోత్సవం

అనకాపల్లి: మండలంలో తుమ్మపాల అవతార్ మెహర్‌బాబా కేంద్రంలో 12వ వార్షికోత్సవ కార్యక్రమాలు గురువారం ఘనంగా జరిగాయి. భక్తులు పలు భక్తిగీతాలు ఆలపించారు. ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ మెహర్‌బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరిపారు. కార్యక్రమంలో మెహర్‌బాబా కేంద్రం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎండీఎం కార్మికుల ధర్నా



ఎంఈవోకు వినతిపత్రం అందిస్తున్న ఎండీఎం కార్మికులు

కశింకోట: స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద గురువారం మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ధర్నా చేశారు. ముందుగా ర్యాలీ నిర్వహించి, రూ.26 వేలు కనీస వేతనం, పెండింగ్ బిల్లులు, వేతనాల సత్వర చెల్లింపు తదితర డిమాండ్లు చేశారు. అనంతరం ఎంఈవోకు వినతి పత్రాన్ని అందించారు. సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, కార్మిక యూనియన్ ప్రతినిధులు సూర్యలక్ష్మి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు, బియ్యం పంపిణీ

అనకాపల్లి: స్థానిక పూడిమడక రహదారి ప్రశాంతి నికేతన్ పాఠశాల ఆవరణలో అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారుడు దివంగత దొడ్డి అప్పారావు 73వ జయంతి వేడుకలు గురువారం జరిగాయి. పాఠశాల కరస్పాండెంట్ డీవీ శ్రీనివాసరావు నిరుపేదలకు చీరలు, బియ్యం, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఖోఖో క్రీడాకారులను తయారు చేసి, జాతీయ స్థాయిలో గెలుపొందేలా అప్పారావు చేసిన సేవలను వివరించారు.

మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌కు వినతి



డీఆర్వో దయానిధికి వినతిపత్రం అందిస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

తుమ్మపాల: రాష్ట్రంలో ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను తక్షణమే విడుదల చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్‌ఐ) జిల్లా అధ్యక్షుడు చింతకాయల శివాజీ డిమాండ్ చేశారు. పట్టణంలోని నెహ్రూ చౌక్ వద్ద డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో 6 లక్షల పైగా నిరుద్యోగులు బీఈడీ, టీటీసీ పూర్తి చేసి డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అల్లు రాజు, జిల్లా నాయకులు కె.సోమునాయుడు, పి.మోహన్, కిషోర్, నిరుద్యోగులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వీఆర్‌ఏల నిరసన



డీఆర్వో దయానిధికి సమస్యలను వివరిస్తున్న వీఆర్‌ఏ సంఘం నాయకులు

తుమ్మపాల: గ్రామ రెవెన్యూ సహాయకు(వీఆర్ఏ)ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తు సీఐటీయూ ఆధ్వర్యంలో వీఆర్‌ఏలు కలెక్టరేట్ వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రవికుమార్, ఎస్.గంగాధర్ మాట్లాడుతూ వీఆర్‌ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ శాఖలో ఖాళీగా ఉన్న వీఆర్వో, వాచ్‌మన్, అటెండర్, కంప్యూటర్ ఆపరేటర్, జీప్ డ్రైవర్ పోస్టులలో 30 శాతంగా ఉన్న మినహాయింపును 70 శాతానికి పెంచి, తక్షణమే నోటిఫికేషన్ ద్వారా ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.500 డీఏను జూన్ 2018 వేతనంతో కలిపి, తక్షణమే ఇవ్వాలన్నారు. తమ సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ డీఆర్వో బి.దయానిధికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆయా మండలాల వీఆర్‌ఏ సంఘాల నాయకులు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రంలో వసతుల కల్పనకు కృషి



వెదురుపర్తిలో గ్రామస్తుల ద్వారా సమస్యలు తెలుసుకుంటున్న దాడి రత్నాకర్

కశింకోట: మండలంలోని వెదురుపర్తి ఆరోగ్య ఉపకేంద్రంలో సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. వెదురుపర్తి గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించి, అక్కడ అవసరమైన లైట్లు, సెలైన్ స్టాండ్లను తన సొంత నిధులతో సమకూరుస్తానన్నారు. గ్రామ సచివాలయం, ప్రభుత్వ పాఠశాలల్ని కూడా సందర్శించి అక్కడి సౌకర్యాలు, సమస్యలను తెలుసుకున్నారు. గ్రామస్తులతో మాట్లాడి, ఏ అవసరం ఉన్నా తన దృష్టికి తీసుకు వస్తే సాధ్యమైనంత మేర వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ పందల ఎల్లయ్యనాయుడు, స్థానిక నాయకులు మదిని నాయుడు, అల్లవరపు నాగు, కొడుకుల రాజాబాబు, ఆళ్ల జగదీష్, పి.శ్రీనివాస్, ఎం.నాయుడు, కొయిలాడ నాగు, హైస్కూల్ హెచ్‌ఎం జీవీకే ఆచారి, ఎంపీటీసీ మాజీ సభ్యులు వేగి దొరబాబు, దాడి కృష్ణ తదితరులున్నారు.

బడుగుల పార్టీ కాంగ్రెస్



దుప్పట్లు పంపిణీ చేస్తున్న గంగాధర్

అనకాపల్లి: బడుగు, బలహీన వర్గాల పార్టీ కాంగ్రెస్‌ను గెలిపించుకునే ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఐఆర్ గంగాధర్ అన్నారు. స్థానిక గాంధీనగర్ పార్టీ కార్యాలయం వద్ద పార్టీ 138వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండాను ఆవిష్కరించి, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ వారి నుంచి దేశాన్ని కాపాడేందుకు ఏర్పడిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. మతోన్మాద బీజేపీ నుంచి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరి సంతోష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కశింకోట: కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక జాతీయ రహదారి పక్కన గురువారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి కత్తెర శ్రీధర్, నాయకులు మల్లపురెడ్డి కోటేశ్వరరావు, కాళ్ల వెంకట సత్యనారాయణ, తగరంపూడి గణపతి, జామకాయల శ్రీను, సేనాపతి ఈశ్వరరావు, కె.వి.మాణిక్యం, బి.బాలమురళి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల నిరసన



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న కార్మికులు

అనకాపల్లి: కాంట్రాక్టు కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని సీఐటీయూ నాయకుడు గంటా శ్రీరాం డిమాండ్ చేశారు. స్థానిక జీవీఎంసీ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికుల నిరవధిక సమ్మెలో భాగంగా గురువారం కార్మికులు మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మెకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు బొమ్మాల రాము, నిమ్మకాయల అజయ్‌కుమార్, నూకరాజు, శివకుమార్, సంతోష్ పాల్గొన్నారు.